# వాస్తవం

డిజిటల్ పత్రిక

ఉన్నది ఉన్నట్లుగా

డెయిలీ. కామ్

శనివారం
14.03.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


## ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

**ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తరువాత నిర్ణయం**

**సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయం : జేపీసీ నేతలు**



**హైదరాబాద్, మార్చి 13:** తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. శుక్రవారం నాడు బస్ భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు జేఏసీ నేతలు. ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తరువాత నిర్ణయం తీసుకుంటామని.. తమ సమస్య లను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయమని జేఏసీ నేతలు తేల్చి చెప్పారు.

### జేఏసీ నేతల డిమాండ్లివే..

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలి..2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి..మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలి..పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలి..ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి..ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి.. అన్ని కేటగిరీల్లో పనిచేసే ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలి

# ప్రజలకు కాపలాదారులుగా ఉంటాం

మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని తెలిపారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలను తిరిగొచ్చానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు.

- అసంపూర్తి సమాచారంతో కొందరు తప్పుడు ప్రచారం
- ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారు
- ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత నాపైన ఉంది
- ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారు
- మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి?
- వ్యతిరేకించడం కాదు..ఎలా చేద్దామో సలహా ఇవ్వండి
- మీ సలహాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపాటు

7లో..



మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు.

మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల నేతలకు ఆయన సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా అని ఆయా పార్టీలకు సీఎం రేవంత్ చురకలంటించారు.

## సీఈసీ అభిశంసనకు నోటీస్..

**పార్లమెంటులో విపక్షం అందజేత ..దేశ చరిత్రలో ఇదే మొదటిసారి**

**న్యూఢిల్లీ, మార్చి 13 :** రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ భారత ప్రధాన ఎన్నికల అధికారి అభిశంసన కోరుతూ భారత పార్లమెంటరీ చరిత్రలో తొలిసారిగా తీర్మానం నోటీస్‌ను పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాలు శుక్రవారం ప్రవేశపెట్టాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలని డిమాండ్‌చేస్తూ లోక్‌సభ, రాజ్యసభలలో ఇండియా కూటమి ఎంపీలు శుక్రవారం నోటీసులు అందజేశారు.సామూహికంగా ఓటర్ల తొలగింపునకు పాల్పడుతూ పక్షపాత, వివక్షాపూరిత వైఖరికి పాల్పడుతున్నందున ఆయనను తొలగించాలని కోరుతున్నట్టు వారు తెలిపారు. ఏడు ప్రధాన ఆరోపణలతో ఉన్న 10 పేజీల ఈ నోటీస్‌పై 130 మంది లోక్‌సభ ఎంపీలు, 63 మంది రాజ్యసభ ఎంపీలు సంతకం చేశారు.

# నేటి నుంచి పది పరీక్షలు

**హైదరాబాద్, మార్చి 13 :** పదో తరగతి వార్షిక పరీక్షలు నేటి (శనివారం) నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మూడు గంటలపాటు పరీక్షలు జరుగుతాయి. ఐదు నిమిషాలు అంటే ఉదయం 9:35 కల్లా వచ్చిన విద్యార్థులను మాత్రమే పరీక్షలకు అనుమతి స్తారు. గంట ముందే సెంటర్లకు చేరు కోవాలని అధికారులు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షల కోసం 2,676 సెంటర్లు ఏర్పాటు చేయగా 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతున్నారు. ఆన్సర్ బుక్‌లెట్‌లోని పేజీలను చింపితే విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదుచేస్తామని అధికారులు హెచ్చరించారు.

**గవర్నర్ శుభాకాంక్షలు..**

పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలను ఒత్తిడిగా భావించ కుండా జ్ఞానం, ప్రతిభను చూపించే అవకాశంగా



భావించాలని సూచించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

# గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

- భయాందోళనకు గురి కావొద్దు
- సరఫరాపై అపోహలు వద్దు
- బాట్లింగ్ ప్లాంట్లలో సరిపడా నిల్వలు
- సోషల్ మీడియా వార్తలను నమ్మొద్దు
- జిల్లాలలో కమిటీలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోండి
- కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 13 :**

తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ గృహ వినియోగదారులు గందరగోళానికి గురికాకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని తెలిపారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పని లేదని పేర్కొన్నారు. గ్యాస్ కొరతపై



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.ప్రధానంగా గ్యాస్ నిల్వలు, అంతర్జాతీయ పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ సమీక్షించారు. ఈ సమావేశానికి సీఎస్, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, గ్యాస్, ఆయిల్ కంపెనీలు, లీగల్ మెట్రాలజీ అధికారులు హాజరయ్యారు. ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలని మార్గనిర్దేశం చేశారు. గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు.గ్యాస్ గృహ వినియోగదారులకు ఎక్కడ అసౌకర్యం కలిగించేలా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాలని.. కలెక్టర్లకు, సీపీలకు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రులకు, ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడా గ్యాస్ సరఫరా చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# ఆవిష్కరణల అడ్డా హైదరాబాద్

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, మార్చి 13 :**

ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరా బాద్ ఎదుగుతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్ర మల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాం కేతికతల ప్రభావంపై అధ్యయనం చేసేం దుకు వచ్చిన జర్మనీ ప్రతినిధుల బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది.ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటవుతున్న ఏఐ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయన్నారు.



## నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోరు!

**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

**మహిళల ఉపాధికే ముప్పు ఏర్పడుతుందని వెల్లడి**

**మహిళలకు వేతనంతో కూడిన నెలసరి సెలవు కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్ కొట్టివేత**



**న్యూఢిల్లీ, మార్చి 13 :** అన్ని రంగాల్లో పనిచేసే మహిళలకు వేతనంతో కూడిన నెలసరి సెలవు కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. అన్ని భాగస్వామ్య పక్షాలతో సంప్రదించి నెలసరి సెలవు విధానాన్ని రూపొందించడానికి పిటిషనర్ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. చట్టం ద్వారా నెలసరి సెలవులను తప్పనిసరి చేయడం వల్ల మహిళల ఉపాధిపై ఊహించని పరిణామాలు సంభవించ వచ్చని విచారణ సందర్భంగా కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది మహిళలను యాజమాన్యాలు నియమించు కోకుండా నిరుత్సాహపరచవచ్చని, తద్వారా వారు శ్రామిక శక్తిలో పాల్గొనడంలో ప్రతికూల ప్రభావం చూపగలదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. పిటిషనర్ శైలేంద్ర మణి త్రిపాఠీ అర్హతలను ప్రశ్నించిన ధర్మాసనం ఈ విషయమై ఏ మహిళ కూడా కోర్టును ఆశ్రయించలేదని స్పష్టం చేసింది.

**పురుషులతో సమానంగా లేమనే భావన కలిగిస్తాయి..**

పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఎంఆర్ షంసద్ వాదనలు వినిపిస్తూ కేవలం కర్ణాటక ప్రభుత్వం మాత్రమే నెలసరి సెలవును అనుమ తించేందుకు విధాన నిర్ణయం తీసుకుందని తెలిపారు. నెలసరి సెలవులు ప్రతికూల ఫలితాలను కలిగిస్తాయని సీజేఐ అభిప్రాయ పడ్డారు. తాము పురుషులతో సమానంగా లేమ న్న భావన మహిళల్లో కలిగిస్తాయని, ఒక నిర్దిష్ట సమయంలో పురుషులతో సమానంగా మహిళలు పనిచేయలేరన్న ఒక రకమైన అభిప్రాయాన్ని సృష్టించడానికి మాత్రమే ఇది ఉపయోగ పడుతుందని సీజేఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఆంక్షలు ఎన్నో?

## ఇళ్ల లబ్ధిదారులకు అధికారుల ఇబ్బందులు

**చర్ల : వాస్తవం**

ఇది ఎలా ఉందంటే.. దేవుడు వరం ఇచ్చినా. పూజారి అడ్డుపడ్డట్టు, ఇందిరమ్మ ఇల్లు వచ్చిందన్న ఆనందం కంటే అధికారులు పెట్టే కండిషన్స్‌ఏ ఇబ్బందిగా మారాయి. ఇల్లు కట్టుకుంటున్నాం అన్న ఆనందం కంటే అధికారులు పెట్టే కండిషన్స్ మరి ఇబ్బందిగా మారాయి. రూపు లెవెల్ పూర్తి చేసుకొని స్లాబ్ కి రెడీ అయిన తరుణంలో స్లాబ్ పోర్టుకు ఒక మీటర్ మాత్రమే పెట్టుకోవాలి అంతకుమించి పెట్టుకుంటే మాత్రం మీకు ఫోటో తీయడం గాని బిల్లు చేయడం గాని జరగదని హౌసింగ్ ఏ ఈ ఓ మరియు గ్రామ పంచాయతీ సెక్రెటరీ చెప్పడంతో అదేంటి సార్ అని ఇందిరమ్మ ఇల్లుల లబ్ధిదారులు అడగగా మాపై అధికారులు హౌసింగ్ పీడీ మరియు ఎండి మాకు పైనుంచి ఆర్డర్ పాస్ చేశారు కాబట్టి మేము ఖచ్చితంగా పాటిస్తాము అని చెప్తున్నారు. వన్ మీటర్ పోర్టుకో పెట్టుకుంటే వర్షా కాలంలో మరి ఇబ్బందిగా మారుతుంది కదా సార్ వర్షం నీరు అంతా ఇంట్లోనే ఉంటుంది పెట్టుకున్న డోర్ మొత్తం పాడవుతుంది అలాగే ల్యాండింగ్ అవుట్ అవుతుంది కదా సార్, స్లాబ్ పోర్టుకు ఒక ఆరు అడుగులు పెట్టుకుంటావని అడిగినా కూడా ఒప్పుకోవడం లేదు కచ్చితంగా వన్ మీటర్ దాటి బయటికి వస్తే మాత్రం బిల్లు చేయమని పై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు కనీస పరిస్థితిపై అధికారులు అర్థం చేసుకోకపోతే ఎలా అని ఇందిరమ్మ ఇల్లుల లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రతి పంచాయతీలో ఐదు ఆరు ఇల్లు శాంక్షన్ అవ్వగా అందులో మూడు, నాలుగు మాత్రమే కట్టి ఒకటి రెండు బేస్ మెంట్ లెవెల్ వరకు ఆగిపోయి ఉన్నాయి, పూర్తిగా కట్టిన వాళ్ళు కంప్లీట్ బిల్లు కోసం ఎదురు చూస్తుంటే, ఏఈఓ మాత్రం వాళ్లు కట్టిన తర్వాతే బిల్లు ఏపిస్తామని ఆంక్షలు విధించారు, సంపూర్ణంగా కట్టిన వాళ్ళు అప్పు చేసి పడే బిల్లు కోసం ఎదురు చూస్తుండగా, అధికారుల మాటలకు, చేసిన అప్పులకు, విసిగి పోతున్నారు. ఇకనైనా పై అధికారులు కరుణించి స్లాబ్ పోర్టుకు ఆరడుగులు పెట్టుకోవడానికి పర్మిషన్ ఇవ్వాలని, సంపూర్ణంగా కట్టిన ఇందిరమ్మ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఇందిరమ్మ ఇల్లుల లబ్ధిదారులు కోరుకుంటున్నారు.



అసంపూర్తిగా ఉన్న ఇల్లు



సంపూర్ణంగా కట్టిన ఇల్లు.. కానీ బిల్లు పడలేదు..

## 10 వ తరగతి పరీక్షలకు
# సర్వం సిద్ధం

### ఎంఈఓ పరిటాల వెంకటరమణ

**చర్ల : వాస్తవం**



చర్ల మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన 10వ తరగతి పరీక్షలు నేటినుంచి (14 మార్చి) , 16 ఏప్రిల్ 2026 వరకు జరగనున్నాయని ఎంఈఓ పరిటాల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు, మండలంలో మొత్తం 311 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 228 ,సత్యనారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 83 మంది వ్రాయనున్నారు. ఇద్దరు చీఫ్ సూపర్నిడెంట్స్ ,ఇద్దరు డిపార్ట్మెంట్స్ ఆఫీసర్స్ ,3 కస్టోడియన్స్‌తో పాటు 19 మంది ఇన్విజిలేటర్స్‌ని పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ నియమించిందని ప్రకటించారు .పరీక్ష కేంద్రాలలో త్రాగు నీటితో పాటు ,ఆరోగ్య కార్య కర్తలను నియమించి అన్నీ వసతులు కల్పించినట్లు తెలిపారు .సిసి కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేందుకు పోలీస్ వారి సహకారం తీసుకొంటున్నామని,పరీక్ష కేంద్రాల వద్ద ఇతర వ్యక్తులు సంచరించరాదనీ ,పరీక్షా సమయంలో జీరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని సూచించారు.

# గ్రామాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తా

### బీజేపీ మానకొండూర్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామిగౌడ్

**వాస్తవం : ఇల్లంతకుంట:** ఇల్లంత కుంట మండలంలోని రహీంఖాన్ పేట గ్రామ ప్రజలు గత సర్పంచ్ ఎన్నికల్లో తిరస్కరించినప్పటికి నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజల సంక్షేమం, గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తాను. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో రహీంఖాన్ పేట పాత ఎస్సీ కాలనీ వద్ద రూ:50000ల వ్యయంతో సింగిల్ ఫేజ్ బోర్ మోటార్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బత్తిని స్వామిగౌడ్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకోవడం జరుగుతుందని అన్నారు. ఎన్నికలనేటివి ఐదేళ్లకోసారి వస్తాయి పోతాయి, కానీ ప్రజలకు,గ్రామానికి చేసిన అభివృద్ధి శాశ్వతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



# కొత్తపల్లిలో పశువులకు గాలికుంటు టీకాలు

### కార్యక్రమాన్ని తనిఖీ చేసిన జిల్లా పశు వైద్యాధికారి

**వాస్తవం : కాటారం**

కాటారం మండలంలోని కొత్తపల్లి, సుందరాజపేట గ్రామాల్లో గాలికుంటు (ఎఫ్ఎమ్‌డీ) వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, పశుపోషకులకు టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గాలి కుంటు వ్యాధి పశువులకు తీవ్ర నష్టం కలిగించే వ్యాధి కావడంతో ముందస్తు జాగ్రత్తగా ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ అసోడా కుమారస్వామి ఆకస్మికంగా తనిఖీ చేసి టీకాల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. టీకాల ప్రక్రియ, రికార్డుల నిర్వహణ, పశువులకు టీకాలు వేయించే విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఉన్న అన్ని పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయాలని, రైతులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ పశువులను రక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు గాలికుంటు వ్యాధి లక్షణాలు, దాని వల్ల కలిగే నష్టాలు, టీకాలు వేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 75 గేదెలకు, 24 గోజాతి పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ జి. రమేష్, డాక్టర్ ధీరజ్, పశు వైద్య సహాయకులు తుంగల రాజశేఖర్, సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.








# అంకుషాపూర్‌లో రంజాన్ తోఫా కిట్ల పంపిణీ

**వాస్తవం : కాటారం**

కాటారం మండలం అంకుషాపూర్ గ్రామ పంచాయతీలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పేద ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ సోదరి కల్పన దేవయ్య అర్హులైన ముస్లిం మైనార్టీ లబ్ధిదారులకు రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసం పరస్పర సహకారం, దాతృత్వానికి ప్రతీకగా



నిలుస్తుందని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రంజాన్ తోఫా కిట్లను అందజేస్తూ వారి పండుగను ఆనందంగా జరుపుకునేలా చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్క ఉమా శంకర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఉగాది,సీతారామకళ్యాణ ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**వాస్తవం : ధర్మసాగర్**

ముప్పారం గ్రామంలోని పురాతన కాకతీయుల కాలంనాటి శ్రీ ముఖ్యనాథ స్వామి దేవాలయంలో ఈ నెల 19, 27 తేదీలలో నిర్వహించనున్న పరాభవ నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు,శ్రీ సీతా రామచంద్రుల కళ్యాణ మహోత్సవం కార్యక్రమాల వాల్ పోస్టర్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక ఆవిష్కరించారు. ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సర్పంచ్ రేణుక కోరారు. అదే విధంగా ఆలయ పునర్ వ్యవస్థాపక ఛైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యనాథస్వామి త్రికూటాలయంలోని మిగిలిన రెండు గర్భగుడుల్లో కూడా త్వ



రలో విగ్రహమూర్తుల పునఃప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రతిష్ఠాపన దాతలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంటిపల్లి రేణుక, ఉప సర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్,గ్రామ ఆలయ శాఖ ఎతిరా జుల శోభరాణి, ఎన్ఆర్ఐ ల్యాగ నారా యణ, ఆలయ పునర్ వ్యవస్థాపక ఛైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర,సాక్షి గణపతి ఆలయ ధర్మకర్త గూళ్ళ కొమరయ్య, కమిటీ అధ్యక్షుడు కొన్నె రవీందర్, ఉపాధ్య క్షుడు ఎర్ర చేరాలు, కోశాధికారి దారపు చంద్రయ్య,ఆలయ ప్రధాన అర్చకులు కుర్జీ సాయికృష్ణ,కమిటీ సభ్యులు చిట్యాల రాజేష్,మేకల శ్రీకాంత్,బోడ శివ,పూజారి నగేష్,వార్డు సభ్యుడు వేములకొండ యాదగిరి, సారయ్య, గ్రామ పెద్దలు జునుగుంటి మల్లారెడ్డి,గై కుమార స్వామి, అలుగు సంపత్,చెక్కిళ్ళ సమ్మయ్య, పాల రాజయ్య,కందుకూరి రత్నం, జనార్ధన్, మద్రిపల్లి కుమార్ పాల్గొన్నారు.

# నేటి నుండి పది పరీక్షలు

**విద్యార్థులకు అదనంగా 5 నిమిషాల అనుమతి**

**ఎంఈఓ బండారి మనీలా**

**వాస్తవం : హుస్నాబాద్ ;**

పదవ తరగతి పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ బండారి మనీలా తెలిపారు. మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు ఉండగా హుస్నాబాద్ లోని 4 పరీక్ష కేంద్రాలలో పది పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో హుస్నాబాద్‌లో గల తెలంగాణ మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, జెడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాల ఉండగా మండలంలోని జిల్లెల్ల గడ్డలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లు ఉన్నాయి. కాగా తెలంగాణ మోడల్ స్కూల్‌లో 240, జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాలలో 220, జడ్.పి.హెచ్.ఎస్ బాలికల పాఠశాలలో 201, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలులో 228 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉండగా మొత్తంగా 889 మంది విద్యార్థులు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పది పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు అవసరమయ్యే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్తున్నారు. ఇందులో తాగునీటి సౌక ర్యం, వైద్య సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఉన్నాయి.

**144 సెక్షన్ అమలు**

పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసు శాఖ అనుమతితో 144 సెక్షన్ అమలు పరుస్తున్నట్లు ఎంఈఓ మనీలా తెలిపారు. పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యేంతవరకు పరీక్షా కేంద్రాల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్‌లను మూసి వేసే విధంగా ఆదేశాలు జారీ చేశారు.

**విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్**

విద్యార్థులకు సమయపాలన తప్పనిసరిగా ఉండాలని ఎంఈఓ పేర్కొన్నారు. కాబట్టి పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులు ఉదయం గం. 8:30 లకు పరీక్షా కేంద్రాలకు తప్పనిస



రిగా చేరుకోవాలని సూచనలు ఇచ్చారు. ఉదయం గం.9:30 పరీక్షలు ప్రారంభం కానుండగా గం.9:35 వరకు అంటే 5 నిమి షాల సమయం (గ్రేస్ పీరియడ్) ఈ విద్యా సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం కల్పించింది. ఈ 5 నిమిషాల నిబంధన చాలా కఠినంగా ఉంటుంది. 9:35 త ర్వాత వచ్చిన విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. ఇది విద్యా ర్థులు చాలా ముఖ్యంగా గమనించాలని ఎంఈఓ మనీలా తెలియజేశారు.


జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190





# 'కోడ్' భాష.. వరంగల్లో నిశ్శబ్దంగా అక్రమ అబార్షన్లు

**వరంగల్ జిల్లాలో లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు**



**వాస్తవం : హన్మకొండ**

వరంగల్ హన్మకొండ జిల్లాల్లోని స్కానింగ్ సెంటర్లు డబ్బులకు అమ్ముడుపోయి పుట్టే శిశువు ఆడ, మగ అన్నది కోడ్ భాషలో చెప్పేస్తున్నారు. గత రెండేళ్లలో 1500కు పైగా అక్రమ అబార్షన్లు జరిగినట్లు సమాచారం. వైద్య ఆరోగ్య శాఖ, శిశు సంక్షేమ శాఖ, పోలీసులు డెకాయి ఆపరేషన్లు నిలిపివేయడం వల్లే కొన్ని ఆసుపత్రులు మధ్యవర్తుల ద్వారా అడ్డదారుల్లో లింగ నిర్ధారణ, అబార్షన్లు నిర్వహిస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.

## డ్రైనేజీ,సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**వాస్తవం : మనోహరాబాద్:**

మనోహరాబాద్ మండల్ మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలోని 13వ వార్డులో పంచాయతీ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఉప సర్పంచ్ ప్రవీణ్ కుమార్ నూతన పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు మద్దూరి నాగరాజు గౌడ్,కాలనీవాసులతో కలిసి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎస్పీ కాళిదాస్,పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు జోన్నోజీ రంగాచారి,నాయకులు నరేందర్ రెడ్డి,వెంకటేష్,శ్రీ పాల్,బాలేష్,పంచాయతీ సెక్రెటరీ ప్రియాంక,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ



**వాస్తవం : మోత్కూర్**

శనివారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు రాయనున్న 103మంది మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక వ్యాపారవేత్త మున్సిపల్ వైస్ ఛైర్మన్ పల్లెర్ల వెంకన్న పరీక్ష ప్యాడ్ లతోపాటు ఇతర సామాగ్రి అందించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవింద రాయుడు మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని వారి సహకారాన్ని దాతృత్వాన్నిసార్థకం చేసేలా ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.

# సేంద్రీయ వ్యవసాయమే మేలు

**వాస్తవం : మోత్కూర్**



బావి తరాల భవిష్యత్తుకు జీవం. పాలడుగు గ్రామ శ్రీ మత్స్యగిరి రైతు ఉత్పత్తి దారుల సంఘం వారి ఆధ్వ ర్యంలో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మథ ర్ థెరీస్సా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఫాదర్ శ్రీ పోలీసెట్టి జూలియన్ వి చ్చేసి సేంద్రీయ వ్యవసాయ ఉపయో గాలపై క్లుప్తంగా వివరణ ఇస్తూ, భ విష్యత్ తరాలకు మెరుగైన ఆరోగ్యా న్ని అందించుటకు ప్రతి ఒక్క రైతు తమ ఇంటి ఆహారం కోసం సేం ద్రీయ వ్యవసాయం వైపు వెళ్ళే ప్ర యత్నం చేయాలని తెలిపారు.రైతు ఆరోగ్యంగా ఉన్నపుడే రాజ్యం సుభి క్షంగా వర్ధిల్లుతుందని,నేటి వ్యవసా య ప్రక్రియలో క్రిమిసంహారకమైన ఎరువులను వాడి పండించిన ఆహా ర పదార్థాలు తినటం మూలంగా రకరకాల క్యాన్సర్లు,షుగర్లు మొదల గు భయంకరమైన రోగాల బారిన పడుతున్నట్లు తెలుపుతూ,ప్రస్తుత ప్రపంచంలో మన భారతదేశం షుగర్ వ్యాధికి కేరాఫ్ అడ్రస్సుగా నిలిచిందని అందుకు రైతులంతా తమ సేంద్రియ పంటల ద్వారా అ డ్డుకట్ట వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంతటి భగవంతు ,ఉపసర్పంచ్ దడిపెల్లి సైదులు ,మాజీ ఉపసర్పం చ్ ఎడ్ల భగవంత్, సంఘ డైరెక్టర్లు ముక్కముల మచ్చగిరి,యాస మాధవి, యాద య్య,భూపాల్ రెడ్డి, రైతులు సింగిరెడ్డి నరసింహ రెడ్డి, గొర్ల బిక్షం, బొడిగే మచ్చగిరి, పుల గం కవిత,కొంపల్లి నర్సమ్మ, ముక్కె ర్ల మహేష్,కొంపల్లి అంజయ్య,ఆళ్ల సోమప్ప,మోత్కూర్ చిట్టులయ్య, నర్సయ్య, మల్లిఖార్జున, వెంకన్న, మర్రిపెల్లి ఉప్పేష్, సంఘ సిఈఓ నర్సింహా చారి పాల్గొన్నారు.



## కాలువ పూడికతీత పనుల పరిశీలన

**వాస్తవం : మోత్కూర్**

పాలడుగు చెరువు నుండి దత్తప్పగూడెం మట్లకుంట చెరువు వరకు వరకు గల కాలువ పూడికతీత పనుల ను దత్తప్పగూడెం గ్రామపంచాయతీలో ఎంపీడీవో పరి శీలించారు. ఈ సందర్భంగా కూలీలతో వారు మాట్లా డుతూ,క్షేత్ర స్థాయిలో నిర్దేశించిన కొలతల మేరకు నా ణ్యమైన పని చేయడం వలన ప్రభుత్వం నిర్దేశించిన రో జుకు 307 రూపాయల వేతనం మీరు పొందవచ్చున ని తెలిపారు. ఎన్.ఎం.ఎం.ఎస్ ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఎన్ఎంఎంఎస్ హాజరు ఉన్న వారు మా త్రమే పనులకు రావాలని తెలిపారు మరియు ఉపాధి హామీ పథకంలో రాబోతున్న మార్పుల గూర్చి వారికి వివరించడం జరిగింది. నాణ్యత తో కూడిన పనులు చేపిస్తున్న క్షేత్ర సహాయకుడు సోమిరెడ్డిని అభినందిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ బాలాజీ ,ఏపీ ఓ కరుణాకర్ క్షేత్ర సహాయకుడు కంచర్ల సోమిరెడ్డి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



**వాస్తవం, దౌల్తాబాద్, మార్చి 13:** దౌల్తాబాద్ మండలం గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపా ధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధిం చారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్యాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడం ద్వారా చదువుపై మరింత అవ గాహన పెరుగుతుందని తెలిపారు. ఇటువంటి కార్యక్ర మాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా నాయకత్వ లక్షణాలను కూడా అభివృద్ధి చేస్తా యని పేర్కొన్నారు. కలెక్టర్‌గా జస్మిత, డీఈవోగా కృష్ణ, ఎంఈఓగా మధు, ప్రధానోపాధ్యాయుడిగా అక్షయ వర్ధ న్ బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థులు తరగతులు నిర్వహిస్తూ తోటి విద్యార్థులకు పాఠాలు బోధి ంచారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయు జిల్లా అధికార ప్రతినిధి మహేందర్ రెడ్డి, పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు ఇంద్రసే నారెడ్డి, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, నోడల్ ఆఫీసర్ వెంకటయ్య, ఉపాధ్యాయులు నవీన్ రెడ్డి, నర్సింలు, రజిత, జ్యోతిర్మయి, స్రవంతి పాల్గొన్నారు.






# స్వచ్ఛతలో పట్టణ ప్రజలంతా భాగస్వాములవ్వాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి**

**వాస్తవం : హుస్నాబాద్ :**



హుస్నాబాద్‌ను స్వచ్ఛ పట్టణంగా త యారు చేయాలంటే పట్టణ ప్రజ లంతా స్వచ్ఛతలో భాగస్వాముల వ్వాలని మునిసిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భా గంగా పురపాలక సంఘ చైర్పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో పట్టణం లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ఏర్పాటు చేశారు. నీరు నిలువ ఉన్న ప్రదే శాలలో స్ప్రే, ఆయిల్ బాల్స్ వే యడం, బ్లీచింగ్ చల్లడం, చెత్త విభజనపై అవగాహన , డ్రై డే ఫ్రై డే కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పట్టణ ప్రజలందరూ వ్యక్తిగత శు భ్రతతో పాటు పరిసరాల పరిశు భ్రతను పాటించాలని, నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు అధికమై ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ,నీటి నిలువ లేకుండా చూ సుకోవాలని, చెత్తను బయట పడవే యకుండా మున్సిపల్ వాహనానికి చెత్తను వేరు చేసి అందించాలని కోరారు.అనంతరం 4 వ,10 వార్డ్ లలో మినీ వాటర్ ట్యాంకులను శు భ్రం చేశారు. పట్టణ ప్రజలందరూ స్వచ్ఛతలో భాగస్వామ్యమై హుస్నా బాద్ పట్టణాన్ని స్వచ్ఛ హుస్నాబాద్ పట్టణంగా తయారు చేయాలని, ఏ మైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ , మున్సి పల్ అధికారులు, బేసిల్ ఫౌండేషన్ సభ్యులు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలి

**వాస్తవం, దౌల్తాబాద్, మార్చి 13:**



పార్టీలకు అతీతంగా అందరి గ్రా మస్తులు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆద ర్శవంతంగా తీర్చిదిద్దుకోవాలని ఇం దుకు గ్రామస్తులు సహకారం అం దించాలని సర్పంచ్ షేక్ అలీ అన్నా రు. దౌల్తాబాద్ మండలం అహ్మద్ నగర్ గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన. ప్రగతి ప్రణాళిక కార్యక్ర మంలో గ్రామంలోని ప్రధాన వీధు లను యువత సహకారంతో శుభ్రం చేశారు. అలాగే పల్లె ప్రకృతి వనం వద్ద క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని మురికి కాలువల పరిశుభ్రతపై గ్రామ స్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తచెదరని మురికి కాలువలో వేయ కూడదని, మన గ్రామాన్ని మనమే ఆదర్శంగా అభివృద్ధి చేసుకుంటే మరిన్ని నిధులు వస్తాయని దీనికి ప్రతి ఒక్కరు సహాయ సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రభు త్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపా లన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రా మంలో నెలకొన్న వివిధ సమస్య లను పరిష్కారానికి మంచి అవకా శం వచ్చిందని ఈ అవకాశాన్ని పార్టీలకు అతీతంగా గ్రామస్తులం దరూ ఏకమై గ్రామ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి వినో ద్. గ్రామపంచాయతీ పాలకవర్గ గ్రామ యువకులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల : వాస్తవం

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్,నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి భోజనశాల, వంటశాల,అత్యవసర సామాగ్రి నిల్వలు, విద్యార్థుల హాజరు పట్టిక,పాఠశాల పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు,విద్యుత్,త్రాగునీరు,విద్యార్థులకు వేర్వేరు మరుగుదొడ్లు,ప్రహరీ గోడ వంటి సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఈ సంవత్సరం 3శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం సకాలంలో అందించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.అనంతరం మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో అమలవుతున్న ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్‌తో కలిసి పరిశీలించారు. జూన్ 12 వరకు 99 రోజులపాటు గ్రామ,మండల,నియోజకవర్గ,జిల్లా రాష్ట్ర స్థాయిలలో కార్యక్రమం అమలు చేస్తారని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం,పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు.తరువాత మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన భూసేకరణ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. దేవులవాడ, మందమర్రి,తిమ్మాపూర్,కోటపల్లి ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# చలివేంద్రం ప్రారంభం

దాహార్తి తీరుస్తున్న చిన్నారి అభినందనీయుడు

తహసీల్దార్ శ్రీనివాస్,సిఐ రాజువర్మ

చర్ల : వాస్తవం




మండల కేంద్రంలోని రఘు థియేటర్ రోడ్‌లో ధనికొండ చిన్నారి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తన ఇంటి ముందు శుక్రవారం చలివేంద్రాన్ని తహసీల్దార్శ్రీనివాస్, సిఐ రాజువర్మ ప్రారంభించారు.దనికొండ నర్సింహారావు అనసూయ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు రిబ్బన్ కత్తిరించి ప్రారంబించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా రహదారి వెంట వెల్లే పాదాచారుల దాహార్తిని తీర్చడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత మంది నిర్వహించాలని కోరారు.చిన్నారిని స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసారు.కార్యక్రమంలో ఎస్ ఐ కేశవ్,ఆర్ఐ నరసింహారావు,మీకోసం మేమున్నాము సంస్థ చైర్మన్ నీలి ప్రకాష్, వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ,మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తోటమల్ల రమణమూర్తి,దనికొండ చిన్నారి,దొడ్డి సూరిబాబు,సయ్యద్ అజీజ్,రౌతు నరసింహారావు,కాకి అనిల్,కొమరవరపు రవి, ఆకుల సర్వేశ్వరావు,రంగు లక్ష్మినారాయణ,తన్నీరు సాయి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి

# అండగా కల్వెలపాలెం గ్రామస్తులు



వాస్తవం : మాదుగులపల్లి

ఇటీవల కాలంలో కల్వలపాలెం గ్రామానికి చెందిన పన్నీరు అనంతలక్ష్మి గుండెపోటుతో అకాలమరణం చెందడంతో ఆనిరుపేద కుటుంబాన్ని చూసి చలించి పోయిన గ్రామస్తులు విరాళం రూపంలో 33000 రూపాయలు ఆ కుటుంబానికి అందజేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు పోకల రాజు,బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాంపల్లి జగన్,కేసాని పూర్ణయ్య, నాంపల్లి గిరి,పానుగోటి మోహన్ రావ్,కేసాని సాగర్ చిట్యాల అబ్రహం,నల్లబోతు సైదులు,చిట్యాల ఏసోబు,చిట్యాల మార్కయ్య,శ్రీకాంత్,వీరబోయిన శివ,చింతకాయల సైదులు,చిట్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నేడే అంజన్న ఆశీర్వాద యాత్ర

## కొండగట్టుకు సంజయ్ యాత్ర


కొడిమ్యాల : వాస్తవం

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్'అంజన్న ఆశీర్వాద యాత్ర'పేరిట శనివారం'మహాపాదయాత్ర'కు బీజేపీ నాయకత్వం భారీ ఏర్పాట్లుచేస్తోంది.భాజాభజంత్రీలు ,డప్పుచప్పుళ్ల,కళాకారులతో వేలాది మందితో యాత్ర సాగనుంది. బీజేపీ ప్రజాప్రతినిధులకు తోడు యాత్రలో పాల్గొనేందుకు బీజేపీ శ్రేణులు,హిందుత్వవాదులు,హనుమాన్ భక్తులు భారీగా తరలివచ్చేందుకు సిద్ధం కావడంతో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చేయాల్సిన ఏర్పాట్లపై బీజేపీ సీనియర్ నేత డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి,కరీంనగర్,సిరిసిల్ల జిల్లాల ఇన్చార్జి భండారి శాంతికు మా ర్,మోహన్ రెడ్డి,ఆయా జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి,రెడ్డబోయిన గోపీ,పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్,బిజెపి జిల్లా నాయకులు రేకులపల్లి రవీందర్ రెడ్డి,మండలఅధ్యక్షులు బండ నరసింహారెడ్డి ,తదితరులు ఏర్పాట్లను చేశారు.పాదయాత్ర ప్రారంభమ య్యేదిలా.శనివారం ఉదయం 7 గంటలకు కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం నుంచి ఈ మహా పాదయాత్ర ప్రారంభమవుతుంది.



ది.రేకుర్తి,కొత్తపల్లి,గంగాధర, పూడూరు,కొడిమ్యాల,మల్యాల మీదుగాకొండ గట్టు అంజన్న ఆలయం వద్దకు చేరుకుంటారు. దాదాపు 40 కి.మీల మేరకు కాలి నడకన వెళ్లి కొండగట్టు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులుచెల్లించుకుంటారు.

# పేకాట స్థావరంపై మెరుపు దాడి



వాస్తవం : ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. శుక్రవారం రోజున కొంతమంది వ్యక్తులు ఒక గుడిసెలో జూదం ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది,ఎల్లారెడ్డిపేట ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేశారు.దాడిలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 04 మొబైల్ ఫోన్లు, 02 మోటార్ సైకిళ్లు, ప్లేయింగ్ కార్డులు మరియు రూ.8,100 నగదు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డిపేట ఎస్సై హెచ్చరించారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం

వాస్తవం



# ఘనంగా కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు



వాస్తవం : ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.జన్మదిన వేడుకలను నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కో-కన్వీనర్ వర్ధ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్లారెడ్డిపేట దే కేర్ సెంటర్‌లో వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి వారికి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వర్ధ సతీష్ కుమార్ మాట్లాడుతూ కవిత ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.రాబోయే రోజుల్లో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆమెకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.జాగృతి జిల్లా నాయకుడు కదిరి భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే దిశగా జాగృతి పని చేయాలని, భవిష్యత్తులో కవిత నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా కో-కన్వీనర్ వర్ధ సతీష్ కుమార్, జాగృతి జిల్లా నాయకులు కదిరి భాస్కర్ గౌడ్, బాయికాడి ఆంజనేయులు, అంతడుపుల బాబు, ఒర్సు అశోక్ పాల్గొన్నారు.

## వేసవికాలంలో
# విద్యుత్ సమస్యలు నివారించడమే లక్ష్యం

కోనాయిపల్లిలో ట్రాన్స్ఫార్మర్ ప్రారంభించిన సర్పంచ్ శ్రీనివాస్



వాస్తవం : దౌల్తాబాద్, మార్చి 13

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఓవర్‌లోడ్ సమస్యలను నివారించేందుకు దౌల్తాబాద్ మండలం కోనాయిపల్లి గ్రామంలో కొత్తగా 25 హెచ్‌పీ ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్ఫార్మర్‌ను గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ శుక్రవారంప్రారంభించారు.గ్రామంలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతున్న కారణంగా పాత ట్రాన్స్ఫార్మర్‌పై అధిక లోడ్ పడుతూ తరచుగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నది.గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు మరియు ప్రజాప్రతినిధుల సహకారంతో కొత్తగా 25 హెచ్‌పీ ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ట్రాన్స్ఫార్మర్ ప్రారంభంతో గ్రామంలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ ప్రశాంత్,ఉప సర్పంచ్ శ్యామవా,వార్డు సభ్యులు స్వామి, స్వామి గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్‌లో లంచాలు తీసుకొని
# యథేచ్ఛగా పర్మిషన్లు



వాస్తవం : అందోల్

అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో లంచాలు తీసుకొని యథేచ్ఛగా పర్మిషన్‌లు ఇస్తున్నారు. ఓ పక్క హైడ్రాధికారుల పేరుతో అనామికుల బేస్ మెట్లు కూలగొడుతూ బఫర్ జోన్ లేదు ఎఫ్ టి, ఎల్ ,జోన్ అసలే లేదు డబ్బులు ఇస్తే ఎక్కడైనా పర్మిషన్ పొందాల్సిందే. అదే అనామికులు అడుగుతే ఆ మెడ దూరం తోసేస్తున్నారు. ఇది ఎక్కడి న్యాయం అని పలువురు విమర్శిస్తున్నారు. అటు మార్కెట్ యార్డు ముంగిట, అటు హనుమాన్ టాకీస్ ఏరియాలో మొత్తం బఫర్ జోన్‌లోకి వస్తున్నా విచ్చల విడిగా పర్మిషన్లు పొందుతున్నారు. అధికారులను అడిగే నాథుడే లేడు. అయితే మున్సిపల్‌లో లంచాలు తీసుకొని యథేచ్ఛగా పర్మిషన్లు...ధనవంతులకే పర్మిషన్‌లు ఇస్తారా అని పలువురు విమర్శిస్తున్నారు.

# జోగిపేట ఎస్ఎస్సి పరీక్షలకు 6 సెంటర్లు

### పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



వాస్తవం : అందోల్

అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఎస్ఎస్సి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అందోలు ఎంఈఓ కృష్ణ తెలిపారు ఆయన మాట్లాడుతూ అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో 6 పరీక్షసెంటర్ల ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 998 మంది విద్యార్థులకు గాను జడ్పీహెచ్‌ఎస్ జోగిపేటలో 184 మంది,ఎస్ఆర్‌ఎం కళాశాలలో 168 మంది,డాన్ బాస్కో పాఠశాలలో 1 76, జడ్పిహెచ్‌ఎస్ అందోల్లో 170, గురుకుల పాఠశాల ఆందో లులో 187. మొత్తం 998 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లున్నట్టు తెలిపారు. సరైన టైమ్ లోనే పరీక్షకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

# ఉన్నత పాఠశాలకు పరికరాలు అందజేత



వాస్తవం : ముప్కాల్

ప్రముఖ వ్యాపారవేత్త ఏనుగు దయనంద్ రెడ్డి రెంజర్ల ఉన్నత పాఠశాలకు రెండు కంప్యూటర్‌లు,ఒక ప్రింటర్‌ను వితరణగా అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.రవి కుమార్ శుక్రవారం రోజు అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల తరుపున ఏనుగు దాయనంద్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, సర్పంచ్ లావణ్య భూమేశ్వర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

### ఇందిరమ్మ ఇంటి
# నిర్మాణం పరిశీలిస్తున్న సర్పంచ్



వాస్తవం : ముప్కాల్:

వేంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మా ణంను గ్రామ సర్పంచ్ ఏట్టెం మహేష్ యాదవ్, పం చాయతీ కార్యదర్శి దేవేందర్ శుక్రవారం రోజు ఉదయం సంయుక్తంగా కలిసి పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన నిర్ణయాలతో అవలంబిస్తున్నా పథకాలతో రాష్ట్ర ప్రజలు సం తోషంగా ఉంటున్నట్లు సర్పంచ్ అన్నారు. అదేవిధంగా గ్రామంలో డ్రైనేజి పనులు, మంచినీటి ట్యాంక్‌లను శుభ్రపరచడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు తెలు నరేష్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మాంసం అమ్మకాల
# యజమానులు శుభ్రత పాటించాలి



వాస్తవం : ముప్కాల్

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ముప్కాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రోజు ఉదయం సర్పంచ్ కొమ్ముల సాయమ్మ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఇట్టి సమావేశంలో భాగంగా స్థానిక మాంసం అమ్మకాల యజమానులతో సమావేశం నిర్వహించి తగు సూచనలను అందించారు. అమ్మకాల చోట వ్యాపారస్తులు శుభ్రతను పాటించాలన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నయ్య,వార్డు సభ్యులు,వ్యాపార యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు కాపలాదారులుగా ఉంటాం

**మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని తెలిపారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలను తిరిగొచ్చానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు.**

- అసంపూర్తి సమాచారంతో కొందరు తప్పుడు ప్రచారం
- ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారు
- ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత నాపైన ఉంది
- ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారు
- మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి?
- వ్యతిరేకించడం కాదు..ఎలా చేద్దామో సలహా ఇవ్వండి
- మీ సలహాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపాటు

మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల నేతలకు ఆయన సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా అని ఆయా పార్టీలకు సీఎం రేవంత్ చురకలంటించారు.



మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు.

**హైదరాబాద్: మార్చి 13:** మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని తెలిపారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలను తిరిగొచ్చానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు.గొప్ప నగరాన్ని నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామన్నారు. మాకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదన్నారు.మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల నేతలకు ఆయన సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా అని ఆయా పార్టీలకు సీఎం రేవంత్ చురకలంటించారు.

# విపత్తుల తీవ్రతను నివారించేందుకు ముందస్తు ప్రణాళికలు

## బాల్ రక్షా భారత్, సేల్స్ ఫోర్స్ ఫౌండేషన్ మరియు యూనిసెఫ్ సంయుక్త కార్యాచరణ





**హైదరాబాద్ :** బాల్ రక్షా భారత్, సేల్స్ ఫోర్స్ ఫౌండేషన్ మరియు యూనిసెఫ్ విపత్తులను ముందే పసిగట్టి రాబోవు విపత్తులను అనగా ప్రకృతి పరంగా, మానవీయ తప్పిదలవలన మరియు ప్రతిరోజూ సమాజం ఎదుర్కొంటున్న ప్రమాదాలను మరియు వాటి తీవ్రతను ముందుగానే అంచనా వేసి దానికి రాష్ట్రంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సమాజాన్ని సమాయత్తం చేయడానికి ఒక రాష్ట్ర స్థాయి వర్క్షాప్ స్థానిక హోటల్ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సామాజిక కార్యకర్తలు , స్వచ్ఛంద సంస్థలు , ప్రభుత్వ అధికారులు మరియు ఎస్.డి.ఆర్.ఎఫ్ వంటి శాఖాధికారులు కూడా కార్యక్రమానికి విచ్చేసి వారి సలహాలను, సూచనలను అందించారు. ఈ వర్క్షాప్ ముఖోద్దేశ్యం రాష్ట్రంలో లేదా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రాబోవు కాలంలో ఎదుర్కోబోతున్న వేసవి కాలపు వేడి గాలులు, రోడ్డు భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు , వరదలు , ఉప్పెనలు , భూకం పాలు మరియు ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితులు, ప్రత్యేకించి పిల్లల భద్రత ఇంటినుండి పాఠ శాలకు -పాఠశాల నుండి ఇంటికి అనే దృక్కోణంలో తీసుకోవలసిన జాగ్రత్తలు , ప్రభుత్వ శాఖలు , స్వచ్ఛంద సంస్థలు , యువత, సమాజం, స్థానిక సంస్థలు, రాష్ట్ర పరిపాలనా విభాగాలు ఉమ్మడిగా చేపట్టాల్సిన తక్షణ మరియు దీర్ఘకాలిక ప్రణాళికలు మరియు చర్యలపై ఈ వర్క్షాప్‌లో సుదీర్ఘముగా చర్చించడం జరిగింది.ముఖ్యముగా పాఠశాల భద్రత , ఎర్లీ వార్నింగ్ (ముందస్తు ప్రకటన మరియు విపత్తులు నిర్వహణ మరియు వాటి తాకిడిని తగ్గించే విధివిధానపై ప్రత్యేకమైన చర్చ చేయగా అన్ని సంస్థలు యూనిసెఫ్ మరియు బాల్ రక్షా భారత్ అని పిలవబడే సేవ్ ద చిల్డ్రన్ సారథ్యంలో ఒక పటిష్టమైన కార్యాచరణ రూపకల్పనకు నాందిపలికింది . విపత్తులు నిర్వహణ మరియు సమాజ సమాయత్తం అనే అంశాలను పాఠశాల కార్యక్రమాల్లో మరియు సామాజిక కార్యక్రమాల్లో ఇనుమడింప చేయాలనీ తద్వారా అనుకున్న రీతిలో ఫలితాలు సాధించవచ్చని వర్క్షాప్‌లో పాల్గొన్న సభ్యుల సూచనగా వెలువడింది . అంతేకాక , ఈ వర్క్షాప్ ముఖ్యముగా వైపరీత్యాలను తగ్గించడానికి, వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రధానంగా దుర్భల పరిస్థితుల్లో వున్న పిల్లలు మరియు సమాజాన్ని సంరక్షించడానికి ముందస్తు ప్రణాళికలు అవసరమని తద్వారా పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం ఉంటుందని తద్వారా ప్రాణ నష్టం మరియు ఆస్తి నష్టం జరగకుండా సమాయత్తం కావడం సాధ్యమౌతుందని ఈ ప్రణాళికలు రాష్ట్రంలో అనివార్యమని వక్తలు నొక్కివక్కాణించారు. ఈ సందర్భంగా బాల్ రక్షా భారత్ ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడు రాష్ట్రాల్లో రూపొందించిన పాఠశాల భద్రతా కరికులం మరియు సాధించిన ప్రగతిని ఒక ఉదాహరణగా ప్రదర్శించగా , యూనిసెఫ్ మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విపత్తుల నిర్వహణలో చేపట్టిన ఊహలను వివరిస్తూ కొన్ని కీలకం సలహాలతో ఒక మార్గదర్శకాన్ని రచించడానికి నాంది పలికారు . ఎటువంటి విపత్తు సంభవించినా పిల్లలు , మహిళలు , పేదరికం నడమ నివసించే సమాజాన్ని తప్పక ప్రాధాన్యతా క్రమంలో ఉంచాలని , తగిన కార్యక్రమాలు చేపట్టాలని వక్కాణించారు . ఈ సందర్భంగా సేల్స్ ఫోర్స్ ఫౌండేషన్ -బల్ రక్షా భారత్ రూపొందించిన మాదిరి పాఠశాల , అంగన్వాడీ మరియు కమ్యూనిటీ రిస్క్ మరియు రక్షణ ప్లాన్ ను విడుదల చేసి ప్రదర్శించారు . ఈ కార్యక్రమానికి శ్రీ అచ్చులేందర్ రెడ్డి గారు, ఐ.ఎఫ్.ఎస్ పూర్వ ప్రిన్సిపాల్ కన్సర్వేటివ్ అఫ్ ఫారెస్ట్, పూర్వ బయోడైవర్సిటీ ఛైర్పర్సన్ మరియు బయోడైవర్సిటీ సలహాదారు ముఖ్య అతిధిగా పాల్గొనగా, రామప్ప కంచర్ల , విపత్తుల్లో ముందస్తు వ్యూహాల నిపుణులు , వికాస్ గోరా, హ్యూమానిటేరియన్ నిపుణులు , మహేందర్ రాజం , యూనిసెఫ్ డి.ఆర్ .ఆర్ ప్రతినిధి , మల్లాడి శ్రీనగేష్ , , దక్షిణ భారత ఎడ్యుకేషన్ అడ్వైసర్ , బాల్ రక్షా భారత్ , రంగనాథన్ , బాల్ రక్షా భారత్ , కత్తి నర్సింహారెడ్డి , పూర్వ ఉపాధ్యాయ ఏం.ఎల్.సి, ఆంధ్రప్రదేశ్ మరియు అల్ ఇండియా సెకండరీ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, జుట్టు గజేందర్ , ఎస్.టి యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ , సుబ్రహ్మణ్య రాజు, ఎస్.టి యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ , ప్లాన్ , మహిత , వరల్డ్ విజన్ , మారి, ఎడ్యుకేట్ గర్ల్ పాల్గొన్నారు.

# మియాపూర్ ఎక్స్ రోడ్లో యూటర్న్ వల్ల ట్రాఫిక్‌కి విముక్తి

వాస్తవం: శేర్లింగంపల్లి

మియాపూర్ ట్రాఫిక్ సిఐ ప్రశాంత్ సమయస్ఫూర్తి వల్ల.మియాపూర్‌ఎక్స్ రోడ్డులో సర్వీస్ రోడ్డు ప్రారంభానికి ముందు,తర్వాత ట్రాఫిక్ పరిస్థితిఇది .ప్రస్తుతం సీసీ రోడ్డు,ఆర్టీసీ బస్ స ర్వీస్ రోడ్డు ప్రారంభించిన తర్వాత ట్రాఫిక్ ట్రాఫిక్ సిఐ ప్రశాంత్ ఆలో చనల వల్ల రెండు జంక్షన్లో వద్ద ట్రా ఫిక్‌ని మియాపూర్ ప్రజలకు విముక్తి కల్పించినారు.గత కొన్ని నెలల నుం




డి మియాపూర్ ట్రాఫిక్ సిఐ ప్రజా ప్రతినిధులు, జిహెచ్ఎంసి సిబ్బంది తో మాట్లాడి అందర్నీ సమన్వయప రిచి తన ఆలోచనలను రూపకల్పన




తెచ్చినారు.ప్రతి ఒక్క వాహనదా రుడు మియాపూర్ సిఐకి మరియు ట్రాఫిక్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలు పుతున్నారు.

### శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా

# శ్రీ శ్రీ అక్కమహాదేవి జయంతి వేడుకలు

వాస్తవం : మార్చి 13 శేరిలింగంపల్లి ప్రతినిధి

శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పి జె ఆర్ స్టేడియంలో ఘనంగా శ్రీ శ్రీ అక్కమహాదేవి జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై అక్కమహాదేవి చి త్ర ఓపటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుష్పాంజలి ఘ టించి ఆమె ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ అక్కమహాదేవి జీవితంలో ఉన్న భక్తి, త్యాగం మరియు ఆధ్యాత్మిక సందేశాలు స మాజానికి ఆదర్శమని తెలిపారు. ఆమె చూపిన మార్గం యువతకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. జయం తి సందర్భంగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు.ఈ వేడుకల ను నిర్వహించిన కమిటీ సభ్యులను స్థానికులు అభినం



దించారు. కుదురుతే ప్రభుత్వం ఈ పండుగ రోజున సెలవు ప్రకటించాలి అని కోరుతున్నాము. ఈ కార్యక్ర మం లో చైర్మన్ ఊరిటి వెంకట్ రావు ప్రజపతి,వైస్ చైర్మన్ పేదపూడి శ్రీనివాస్ ప్రజపతి, అధ్యక్షులు పులివర్తి సుబ్బారావు, ఉపాధ్యక్షులు నిడమనూరి రమణయ్య, ప్ర ధాన కార్యదర్శి మద్దిగొండ అంకమరావు, సంయుక్త కార్యదర్శి నిజాంపట్నం నరసింహారావు, కోశాధికారి మోదుకూరి శ్రీనివాస్ రావు,కార్యవర్గ సభ్యులు ఉరిటి వీరరాఘవులు,వల్లూరి గోపయ్య,ఈమని శ్రీనివాస్ రావు, మోదుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

పోషకాహారం అందించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల అశోక్ నగర్ లోని అంగన్ వాడీ కేంద్రంలో

ఆకస్మిక తనిఖీ

వాస్తవం: సిరిసిల్ల

అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్ర వాల్ ఆదేశించారు. సిరిసిల్ల పట్టణం అశోక్ నగర్ లోని అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అంగన్ వాడీ కేంద్రంలో పిల్లల హాజరు రిజిస్టర్ తనిఖీ చేసి, మొత్తం ఎందరు పిల్లలు ఉన్నారు? రోజూ ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. ప లువురు పిల్లల తల్లులతో మాట్లాడి..గుడ్డు, పోషకాహారం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం పిల్ల ల ఎత్తు,బరువు కొలిచిన వివరాలు,ఆన్లైన్ అలాగే రిజిస్ట



ర్ నమోదు చేసిన వివరాలు పరిశీలించారు. కేంద్రంలో నిలువ ఉన్న గుడ్లు, బాలా అమృతం తనిఖీ చేశారు. పిల్లల ఎత్తు,బరువు కొలిచే యంత్రాల పనితీరు పరిశీ లించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవా ల్ మాట్లాడుతూ..అంగన్ వాడీ కేంద్రాలకు పిల్లలు రో జూ వచ్చేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిం చాలని సూచించారు.పిల్లలు,గర్భిణులు,బాలింతలు అం గన్ వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగంచేసుకోవాలని పిలుపు నిచ్చారు.

### పదవ తరగతి విద్యార్థులకు

# పరీక్షల సామాగ్రి పంపిణీ



వాస్తవం : వేములవాడ

కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి విద్యార్థినివిద్యార్థులకు శుక్రవారం బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోపు మధు ఎగ్జామ్‌ప్యాడ్స్ లను వేములవాడ రూరల్ మండలంలోని నాగయ్య పల్లి,పోశెట్టిపల్లి గ్రామంలో పంపిణీ చేశారు.ఈ సంద ర్భంగా గోపు మధు మాట్లాడుతూ.విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాం క్షించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని, వారికి అవసరమైన సహాయం అందించడానికి తాము ఎప్పు డు సిద్ధంగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు,గ్రామ పెద్దలు,విద్యార్థులు,వా రి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### శ్రీ పెద్దమ్మ

# బోనాల పండుగ మహోత్సవం



వాస్తవం ; కోనరావుపేట

కోనరావుపేట మండలంలోని కొండాపూర్ గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పెద్ద మ్మ తల్లి బోనాల పండుగ జాతర మహోత్సవాన్ని శు క్రవారం ఘనంగా నిర్వహించారు.డప్పుచప్పుల మధ్య లో అమ్మవారి బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వ హించారు.ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్ మాట్లాడుతూ..గ్రామ దేవత అనుగ్ర హంతో గ్రామం సుభిక్షంగా ఉంటూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు పాడి పంటలతో చల్ల గా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పం చ్ రాజి రెడ్డి,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు వంకా యల శేఖర్,ఉపాధ్యక్షులు జిట్టవేణి ప్రశాంత్,దండు రవి,సతీష్,భూమయ్య, నెవురి నరేష్,నాంపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

# బైకును ఢీకొన్న కారు

తీవ్ర గాయాలపాలైన తల్లి,కొడుకులు

వాస్తవం : హుస్నాబాద్

బైకును కారు ఢీకొన్న ఘటనలో తల్లి కొడుకులు తీవ్ర గాయాల పాలైన ఘటన హుస్నాబాదులో చోటుచేసుకుంది.స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం..హుస్నాబాద్ పట్టణ శివారులో వేగంగా వచ్చిన కారు నియంత్రణ కోల్పోయి బైక్‌ను వెనుక నుంచి ఢీకొ ట్టడంతో తల్లీకొడుకులు తీవ్ర గాయాలపాలయ్యారు.?కొండాపూర్ గ్రామానికి చెందిన మండల మహేష్ (28) తన తల్లి మండల సారవ్వ (48)తో కలిసి బైక్‌పై హుస్నాబాద్‌కు వస్తుండగా జ్యోతి నగర్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మడద వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు వీరి బైక్‌ను వెనుక నుంచి అమాంతం ఢీకొట్టింది. దీంతో ప్రమాద తీవ్రతకు కారు ఏకంగా బైక్ పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వెనుక కూర్చున్న సారవ్వ కాలు విరిగిపోగా, మహేష్ భుజం విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. ?బాధితుల ఆర్తనాదాలు విన్న స్థానికులు వెంటనే స్పందించి వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.సమాచారం అం



దుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని ఘటనకు సంబం ధించిన పూర్వపరాలు తెలుసుకునే పనిలో నిమగ్నమై దర్యాప్తు చేపట్టారు.

# పిల్లలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

**రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వాస్తవం : గోదావరిఖని ప్రతినిధి**





ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనగోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం--అనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పోలీస్ కమిషనర్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీసీపీ మాట్లాడుతూ,మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తైనా నాశనం అవుతుందని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని,ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,విద్యార్థులు తమలో ఉన్న అపారమైన శక్తిని సరైన దిశలో వినియోగించుకోవాలని తెలిపారు. యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం,శక్తిని క్రీడలు,చదువు మరియు సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని,ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని, ఎవరికైనా అలాంటి అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలనికోరారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా,వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువతలోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు.నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం వరకు యువకులే బాధితులవుతున్నారని తెలిపారు.వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కారును నడిపే సమయంలో సీటుబెల్ట్ ధరించాలని సూచించారు.ఎప్పుడూ రహదారి ఎడమ వైపునే ప్రయాణించాలని,భారీ వాహనాలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు.సైబర్ నేరాల విషయంలో కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం, అనుమానాస్పద లింకులు పంపడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ప్రవచనకర్త ఎస్.పి. నాయక్ బంజారా, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐలు రమేష్, అనూష,పోలీస్ సిబ్బంది మరియు సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**శాత్రాజ్ పల్లి ఇందిరానగర్**

## అంగన్ వాడీ స్కూల్లో అక్షరాభ్యాసం

**పాల్గొన్న కౌన్సిలర్ గుడిసె సంతోష-కరుణాకర్**



**వాస్తవం : వేములవాడ**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డు శాత్రాజ్ పల్లి ఇందిరానగర్ అంగన్ వాడీ కేంద్రంలోఐసిడిఎస్ సీడీపీఓ సౌందర్య, సూపర్ వైజర్ అంజమ్మ ఆదేశాల మేరకు చిన్నారులకు శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మూడో వార్డు కౌన్సిలర్ గుడిసె సంతోష -కరుణాకర్ హాజరుకాగా అంగన్ వాడీ టీచర్ గుడిసె పద్మ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ గుడిసె పద్మ,ఆశా వర్కర్లు ఎడవల్లి వజ్ర,కన్నం వసంత అంగన్ ఈ పిల్లలు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

**34 కేంద్రాల్లో ఏర్పాట్లు**

**పరీక్ష రాసే విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలి**

**హాజరుకానున్న 7,317 మంది విద్యార్థులు**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

ఈ నెల 14 వ తేదీ శనివారం నుంచి పదో తరగతి పరీక్షలు మొదలు కానున్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రకటించారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 34 పరీక్షా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.నిర్ణీత పరీక్ష సమయం తరువాత ఐదు నిమిషాలు వరకు విద్యార్థులను అనుమతిస్తారు.34 కేంద్రాల్లో పరీక్షలకు ఏర్పాటు చేశారు.పదో తరగతి పరీక్షలకు మొత్తం 7317 మంది విద్యార్థులు హాజరుకానుండగా, బాలురు 3511,బాలికలు 3806 మంది పరీక్షలు రాయనున్నారు.పరీక్షా కేంద్రాల్లో డెస్క్‌లు,తాగునీరు,టాయిలెట్స్,ట్యూబ్ లైట్స్ ఇతర సౌకర్యాలు కల్పించారు.జిల్లాలో 34 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.కుసుమ రామయ్య జడ్పీ హైస్కూల్ (బాయ్స్) సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ వెంకంపేట సిరిసిల్ల, సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం పత్తిపాక వీధి సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ అంబేద్కర్ నగర్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ (బాలికల) ఏ వింగ్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ (బాలికల) బీ వింగ్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ నెహ్రూనగర్, ప్రభుత్వ హైస్కూల్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ (వొకేషనల్) తంగళ్ళపల్లి, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ చందుర్తి, జడ్పీ హైస్కూల్ రుద్రంగి, జడ్పీ హైస్కూల్ (వొకేషనల్) ఇల్లంతకుంట, కేరళ మోడల్ స్కూల్ ఇల్లంతకుంట, జడ్పీ హైస్కూల్ గాలిపెల్లి,జడ్పీ హైస్కూల్ జిల్లెల,జడ్పీ హైస్కూల్ లింగన్నపేట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేములవాడ,శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ వేములవాడ, గౌతం హైస్కూల్ వేములవాడ, జడ్పీ హైస్కూల్ (బాలికల) వేములవాడ, కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ వేములవాడ, హంసిని డిజి హైస్కూల్ వేములవాడ, జడ్పీ హైస్కూల్ (బాయ్స్) గంభీరావుపేట్ (వొకేషనల్), జడ్పీ హైస్కూల్ (బాలికల) గంభీరావుపేట్, జడ్పీ హైస్కూల్(బాయ్స్) ముస్తాబాద్, జడ్పీ హైస్కూల్(బాలికల) ముస్తాబాద్ (వొకేషనల్), జడ్పీ హైస్కూల్ ఎల్లారెడ్డిపేట ఏ వింగ్, జడ్పీ హైస్కూల్ ఎల్లారెడ్డిపేట బీ వింగ్, జడ్పీ హైస్కూల్ వీర్నపల్లి (వొకేషనల్), టీఎస్ మోడల్ స్కూల్ కోనరావుపేట, సిరిసిల్ల (వొకేషనల్), జడ్పీ హైస్కూల్ ధర్మారం, జడ్పీ హైస్కూల్ బోయినపల్లి(వొకేషనల్), జడ్పీ హైస్కూల్ విలాసాగర్ ల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**144 సెక్షన్ అమలు**

పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అలాగే పరీక్ష కేంద్రాల సమీపంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు సూచించారు.



**పర్యవేక్షణకు బృందాలు**

పరీక్షల పర్యవేక్షణకు వివిధ శాఖల అధికారులతో బృందాలు ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు 34, డిపార్ట్ మెంటల్ అధికారులు 34, సిట్టింగ్ స్క్వాడ్ 34, ఫ్లయింగ్ స్క్వాడ్ రెండు టీంలు,అడిషనల్ డిపార్ట్మెంటు ఆఫీసర్స్, స్టేట్ లెవెల్ అబ్జర్వర్స్, కస్టోడియన్ అధికారులను నియమించారు.

**ప్రశాంతంగా పరీక్షలు రాయాలి**

పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్. ఎలాంటి ఒత్తిడి లేకుండా.. ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. పరీక్షల మధ్య విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షా సమయనికంటే ముందే చేరుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

### మైనర్ బాలికకి అసభ్య మెసేజీలను

# బాలుడితో పంపించిన బాధ్యుడి పై కేసు నమోదు

వాస్తవం : చందుర్తి

ఇన్స్టాగ్రామ్ ద్వారా మైనర్ బాలిక కి అసభ్యకరమైన మెసేజ్‌లు చేస్తు ఫోటోలు పంపించిప్రేమిస్తున్నానంటు వేధిస్తున్న మైనర్ బాలుడుకి సహకరించిన పల్లపు నవీన్ అను వ్యక్తి పై కేసు నమోదు చేసి విచారణ అనంతరం జ్యుడీషియల్ రిమండ్ కోసం పంపినట్టు చందుర్తి సిఐ జి వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.వివరాల.తన వద్ద పని నేర్చుకుంటున్న మైనర్ బాలుడికి తన ఫోన్ ఇంటర్నెట్ డాటాఇచ్చి ఇన్స్టాగ్రామ్ నుండి మైనర్ బాలికకు చాట్ చేసేలా వారి మధ్యలేని పోనీ ప్రేమ ఆలోచనలను క్రియేట్ అయ్యేలా ఇన్స్టాగ్రామ్ ద్వారా దగ్గర అవ్వడానికి ప్రయత్నించిప్రేమిస్తున్నా అని అంటే ప్రేమను నిరాకరించిన బాలికను అట్టి బాలుడు తన వద్ద ఉన్న ఇన్స్టాగ్రామ్ చాట్ బయట పెడితే ప్రేమిస్తుంది అంటూ బాలుడిని ప్రేరేపించిన పల్లపు నవీన్ అను నిందితుడిని టెక్నాలజీ ద్వారా గుర్తించి తన నేర ఒప్పుదలను రికార్డు చేసి తన మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసి




రిమాండ్ కోసం కోర్ట్‌కు పంపినట్టు తెలిపినారు.ఎవరైనా సోషల్ మీడియా వేదికగా మైనర్‌లకు నేర్పించిన ప్రేరేపించిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లుతెలిపారు.

# వృద్ధురాలి మృతి



**వాస్తవం: మందమర్రి మార్చి 13:**

పట్టణంలోని రెండవ జోన్‌కు చెందిన జక్కనబోయిన లక్ష్మి(80) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలో మృతురాలు ఒంటరిగా నివసిస్తుండగా, మార్చి 12న రాత్రి అదే ఇంట్లో అద్దెకు నివసిస్తున్న రసూల్ అనే వ్యక్తి శ్రీనివాస్ కు ఫోన్ చేసి, అతని తల్లి లక్ష్మి గడప వద్ద కిందపడి చనిపోయి ఉందని తెలుపగా, సంఘటన స్థలానికి వచ్చి చూసేసరికి ఆమె గడప తగిలి కింద పడడంతో తలకు గాయమై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారని, అదేవిధంగా మృతురాలి కుడి చేతి పై ఏదో జంతువు కరిచినట్లుగా గాయాలు ఉన్నాయని ఆమె కుమారుడు తన ఫిర్యాదులో తెలిపాడన్నారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నమని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించామన్నారు.

### ఉమ్మడి మియాపూర్ డివిజన్ల పరిధిలోనీ చెరువులను

# సుందర శోభిత వనంలుగా తీర్చిదిద్దుతాం

**మన భవిష్యత్తు తరాలకు ఆస్తులు కాదు మంచి ఆరోగ్యం,ప్రశాంత జీవితం ఇవ్వాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది తాజా మాజీ కార్పొరేటర్ శ్రీ ఉప్పలపాటి శ్రీకాంత్**

వాస్తవం : శేర్లింగంపల్లి

ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలోని చెరువుల అభివృద్ధి కొరకై గౌరవ పి ఏ సి ఛైర్మెన్ శ్రీ ఆరెకపూడి గాంధీ సహకారంతో సి ఎస్ ఆర్ నిధులతో గౌరవ ది లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.మక్త మహబూబ్ పెట్ డివిజన్ పరిధిలోని పెద్ద కుడి చెరువు,సుందరికరణలో భాగంగా స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువు పునర్జీవనంలొ భాగంగా చేపట్టినటువంటి సుందరికరణ, పునరుద్ధరణ పనులను,మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలసి పరిశీలించిన ఉమ్మడి మియాపూర్ డివిజన్ గౌరవ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీ ఉప్పలపాటి శ్రీకాంత్.ఈ సందర్భంగా శ్రీకాంత్ గారు మాట్లాడుతూ.. ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్త మహబూబ్ పెట్ విలేజ్ లో గల పెద్ద కుడి చెరువు పునరుద్ధరణ తో దశ దిశ మారునని, చెరువులను సుజల జలం తో అపురూప దృశ్యకావ్యంగా ఆవిష్కృతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తాం అని, పెద్దకుడి చెరువు సుందరికరణలో భాగంగా స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువుల పునర్జీవనంలొ భాగంగా సుందరికరణ,పునరుద్ధరణ పనులను ప్రారంభించడం జరిగినది అని, ఉమ్మడి మియాపూర్ డివిజన్ల పరిధిలోని చెరువుల అభివృద్ధితో దశ దిశ మా



రడం జరుగునని, ఎన్నో ఏండ్ల సమస్య త్వరలో తిరునని,శాశ్వత పరిష్కారం దిశగా చెరువుల అభివృద్ధి చేపట్టాలని మురికి కూపంలాంటి చెరువులను స్వచ్ఛమైన మంచి నీరు లాంటి చేరువులుగా తీర్చిదిద్దాడమే ధ్యేయంగా పని చేసి నిరూపించడం జరుగుతుంది అని,చెరువుల పునర్జీవనం తరువాత సుజల జలంతో అపురూపదృశ్యకావ్యం గా ఆవిష్కృతమైతది అనడంలో ఎటువంటి సందేహం లేదు అని,చెరువుల కట్ట చుట్టూ చెట్లు పెంచి చెరువు చుట్టూ ఉన్న కాలనీల వారికి చక్కటి ఆహ్లాదకంమైన వాతావరణం కలిపిస్తామని, అదేవిధంగా చెరువు సుందరికరణ లో భాగంగా చెరువుల కట్ట పటిష్టం పరిచేలా పునరుద్ధరణ,మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ నిర్మాణం,అలుగు మరమ్మత్తులు,చెరువు కట్ట బలోపేతం,పునరుద్దరణ పనులు,వాకింగ్ ట్రాక్,చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం,చెరువు యొక్క అలుగు నిర్మాణము వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుంది అని తాజా మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు.

# నిజాయితీ చాటుకున్న పారిశుధ్య కార్మికురాలు



**వాస్తవం, బెల్లంపల్లి,మార్చి13:**

తాండూరు మండలం గోపాల్ నగర్‌కు చెందిన గాజుల లక్ష్మికి చెందిన బంగారం చెవికమ్మ శుక్రవారం కింద పడిపోయింది. ఉదయం పంచాయతీ కార్మికురాలు ఇప్ప ఎల్లమ్మ విధులు నిర్వహిస్తుండగా రోడ్డుపై బంగారం చెవికమ్మ దొరకడంతో పంచాయతీ కారోబార్ సంపత్‌కు తెలిపింది. గాజుల లక్ష్మిని పంచాయతీ కార్యాలయం వద్దకు పిలిపించి పోగొట్టుకున్న బంగారం చెవి కమ్మను అందజేశారు. నిజాయితీ చాటుకున్న ఇప్ప ఎల్లమ్మను గ్రామస్తులు అభినందించారు.

# పాఠశాల ఆవరణను పరిశీలించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే



వాస్తవం : జూబ్లీహిల్స్

యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ స్కూలు యాజమాన్య నిర్వాహకుల పిలుపుమేరకు ముఖ్య అతిథిగా పాల్గొని 'యూ" ఆకారపు తరగతి గదులను ప్రారంభించారు. స్కూల్ యాజమాన్యంతో కలిసి పాఠశాల ఆవరణను,తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల యాజమాన్యం వినతి మేరకు ప్రస్తుతం ఉన్న టాయిలెట్లు మరమ్మతులు చేయడం,అలాగే తరగతి గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.అలాగే త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యే విద్యార్థిని,విద్యార్థులకు ఇంటర్ రెండు సంవత్సరాల చదువును తనసొంత ఖర్చులతో చదివిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### సోషల్ మీడియాలో

# నటి అనసూయపై అసభ్యకర వ్యాఖ్యలు

**-నిందితుడిని పట్టుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు**

**వాస్తవం: శేరిలింగంపల్లి మార్చి 13:** అనసూయ భరద్వాజ్ పై సోషల్ మీడియా వేదికలలో అసభ్యకర, అపకీర్తి కలిగించే పోస్టులు పెట్టిన వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీ సులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. 2025 డిసెంబర్ 23 నుంచి కొన్ని సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఆమెపై అవమాన కర, అసభ్య వ్యాఖ్యలు, అపకీర్తి కలిగించే కంటెంట్ ప్రచారం జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు నిర్వహిం చిన పోలీసులు ఇందుకు బాధ్యుడిగా గుర్తించిన జనార్ధన్ (29) అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇంద్రానగర్, హైదరా బాద్‌కు చెందిన జనార్ధన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా @ mm tt। official ద్వారా అనసూయను లక్ష్యంగా చేసుకుని ఏఐ సాంకేతికతతో తయారు చేసిన వీడియోతో పాటు అభ్యంతరకర కంటెంట్‌ను ప్రచారం చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మోసాలకు పాల్పడిన నిందితుల అరెస్ట్

**ఫోన్‌పే, పేటీఎం ద్వారా**
**రూ.18 లక్షలకు పైగా మోసం**
**వాస్తవం: వేములవాడ**

ఆన్ లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి మోసాలకు పాల్పడ్డ నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సిఐ శ్రీనివాస్ ప్రకటించారుసి ఐ శ్రీనివాస్ వివరిస్తూ...గంగాధర మండలం ఒద్యారం గ్రామానికి చెందిన సత్పది సాయితరుణ్ (27), స్వగ్రామంలోని వెంకటేశ్వర దేవాలయంలో పూజారిగా పని చేస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. బెట్టింగ్‌లో భారీగా డబ్బులు కోల్పోవడంతో, మళ్లీ బెట్టింగ్ ఆడేందుకు సులభ మార్గంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు.అందులో భాగంగా వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన చెన్నమాధవుని రామరాజు ప్రతిరోజు వాకింగ్ కోసం ఒద్యారం గ్రామానికి వచ్చేవాడు.ఈ పరిచయాన్ని ఉపయోగించుకున్న సాయితరుణ్, రామరాజుతో స్నేహం పెంచుకుని అతని దగ్గర డబ్బులు కాజేయాలనుకొని, ఒకరోజు రామరాజు ఇంటికి వెళ్లి,అతని మొబైల్‌లో ఫోన్ పే, పేటీఎం అప్లికేషన్లు సరిగా పనిచేయడం లేదని చెప్పి కొత్త పిన్ నంబర్లు సెట్ చేస్తానని నమ్మబలికాడు.తనకు గుర్తుండేలా పిన్ నంబర్లు మార్చడు.ఆతరువాత రామరాజు తిరుపతికి దర్శనానికి వెళ్లాలని చెప్పడంతో,దర్శన టికెట్లు,ట్రైన్ టికెట్లు బుక్ చేస్తానని నమ్మించి అతని మొబైల్ తీసుకున్నాడు.అలా రామరాజుకు తెలియకుండా అతని ఫోన్ పే, టిపిఎం ద్వారా విడతల వారీగా మొత్తం రూ.18,46,885 ను ఇల్లంతకుంట మండలం నరసక్కపేట గ్రామానికి చెందిన ధామేర హరీష్ ఖాతాకు ట్రాన్స్ఫర్ చేశాడు.తర్వాత ఆ డబ్బులను హరీష్ ద్వారా అనే బెట్టింగ్ యాప్‌లో సాయి తరుణ్ ఐడీలకు ట్రాన్స్ఫర్ చేయించి బెట్టింగ్ ఆడాడు. ఇందుకు ప్రతిగా హరీష్‌కు కమిషన్ రూపంలో దాదాపు రూ.1 లక్ష ఇచ్చాడు. అయితే ఆ మొత్తం డబ్బు కూడా బెట్టింగ్‌లో పోయింది.రామరాజు టికెట్ల గురించి అడిగినప్పుడల్లా సాయితరుణ్ వివిధ కారణాలు చెబుతూ తప్పించుకుంటూ వచ్చాడు. చివరకు మోసపోయానని గ్రహించిన రామరాజు బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై బోయినపల్లి ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేశారు.తదుపరి వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు, ఈ క్రమంలో నిందితుడు కొంతకాలం ఉత్తరప్రదేశ్‌లోని దేవాలయాలకు వెళ్లి అక్కడే ఉండి, తరువాత తిరిగి ఒద్యారం వచ్చి హరీష్‌ను ఫోన్ చేసి వెంకట్రావుపల్లి గ్రామంలోని రాజన్న




హోటల్ వద్దకు రమ్మనగా సాంకేతికత ఆధారంగా వేములవాడ రూరల్ సిఐ శ్రీనివాస్ సాయి తరుణ్, హరీష్‌లను అరెస్ట్ చెసి వారి వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లు, నగదు 80,000 నగదు స్వాధీన పర్చుకొని రిమాండ్‌కి తరలించడం జరిగిందని తెలిపారు.అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఫోన్‌పే, పేటీఎం వంటి డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన పిన్ నంబర్లు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఆందోళన

**స్టైఫండ్ పెంచమంటే కాలయాపన**
**చేస్తున్నారని విద్యార్థుల ఆగ్రహం**
**వాస్తవం : రాజేంద్రనగర్**

రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు.ప్రభుత్వం మా డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళన విరమించేది లేదని ముగ్గురు విద్యార్థులు భవనం పైకి ఎక్కి నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థులుమాట్లాడుతూ. విద్యార్థులకు సంబంధించిన న్యాయపరమైన అంశాలపై శాంతియుతంగా నిరాహార దీక్ష చేపట్టామన్నారు. అధికారులు మాత్రం మా ఆందోళనను పోలీసులతో అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.ఎక్కడికక్కడ విద్యార్థులను హాస్టల్ గదులలోనే ఆపి పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. స్టైఫండ్ పెంచాలని పలుమార్లు వ్యవసాయ శాఖ మంత్రికి, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి వచ్చి మా డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. అనంతరం విశ్వవిద్యాలయానికి చేరుకున్న బిఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమా



ర్ విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. వీసికి ఉన్న అధికారాలకు మంత్రులు అడ్డుకత్తెర వేస్తున్నారని దుయ్యబట్టారు. విద్యార్థుల క్యాంపస్ లోకి పోలీసులు రావడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇప్పటివరకు క్యాంపస్ లోకి పోలీసులు వచ్చిన దాఖలాలు లేవని కాంగ్రెస్ హయాంలో ఇలాంటివిసర్వసాధారణమైపోయాయని వాపోయారు. పేద విద్యార్థులు బాగుపడకుండా బర్లను,గొర్లను మేపుకునే విధంగా ముఖ్యమంత్రి,వ్యవసాయ శాఖ మంత్రి వారిని అణగదొక్కుతున్నారని ఆరోపించారు.ప్రస్తుతం మంత్రుల మీటింగులు,ఆర్భాటాల ఖర్చులకు ఎలాంటి నియమ నిబంధనలు లేవని అన్నారు. కానీ పేద విద్యార్థులకు ఉన్న నిధులను ఇవ్వడానికి మంత్రులకు మనసు ఒప్పకపోవడం సిగ్గుచేటు అన్నారు.న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు విద్యార్థుల వెంట బిఆర్ఎస్ పార్టీ ఉంటుందనిపేర్కొన్నారు.










జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్టుల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్టుల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110